# ప్రభుత్వ సంస్థల కమిటీ
# (రూల్ 254-255)

**కమిటీ ఏర్పాటు : (రూల్ 255)**

ఈ కమిటీలో పన్నెండుమంది సభ్యులు ఉంటారు. వీరిలో తొమ్మిదిమంది శాసనసభ నుండి ఎన్ను కొనబడినట్టి సభ్యులు, ముగ్గురు శాసన పరిషత్తు నుండి ఎన్నుకొనబడినట్టి సభ్యులు ఉంటారు. ఇందుకు సంబంధించి సభాపతి రూపొందించిన నిబంధనల ప్రకారం, సింగిల్ ట్రాన్స్ఫరబుల్ ఓటుద్వారా దామాషా ప్రాతినిధ్య సూత్రం ప్రకారం వారిని ఎన్నుకుంటారు.

**ఎన్నిక విధానం :**

ప్రభుత్వ సంస్థల కమిటీలో సభ్యులను ఎన్నుకోవాలని కోరుతూ శాసనసభలో ప్రతిపాదన చేస్తారు. ప్రతిపాదనను ఆమోదించిన తర్వాత ఈ ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాన్ని ప్రకటిస్తారు. నామినేషన్లను వేయుటానికి, అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోటానికి, అవసరమైతే ఎన్నిక జరగవలసిన తేదీలను నిర్ణయిస్తూ వివరాలు ఆ ప్రకటనలలో తెలియజేస్తారు. నామినేషన్లు అందిన తర్వాత నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల పట్టికను నోటీసు బోర్డులో ఉంచుతారు. నామినేషన్లను దాఖలు చేసిన సభ్యుల సంఖ్య ఎన్నుకోవలసిన సభ్యుల సంఖ్యకు సమానంగా ఉన్నట్లయితే, అభ్యర్థిత్వపు ఉపసంహరణ గడువు ముగిసిన పిమ్మట నామినేషన్లు దాఖలు చేసిన సభ్యులు ఎన్నిక అయినట్లు ప్రకటిస్తారు. ఉపసంహరణ గడువు ముగిసిన పిమ్మట ఎన్నుకోవలసిన సభ్యుల సంఖ్యకంటే నామినేషన్లు వేసిన సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉన్నయెడల కార్యక్రమంలో నిర్ణయించిన తేదీన ఎన్నిక జరుగుతుంది. ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు.

**అధ్యక్షుని నియామకం :**

కమిటీకి ఎన్నికయిన సభ్యులలో ఒకరిని సభాపతి కమిటీకి అధ్యక్షునిగా నియమిస్తారు.

**మంత్రి కమిటీలో సభ్యుడిగా ఉండరాదు :**

మంత్రిని కమిటీ సభ్యుడుగా ఎన్నుకోరాదు. ఏ సభ్యుడైనా కమిటీకి ఎన్నిక అయిన తర్వాత మంత్రిగా నియమితమైన యెడల, అట్టి నియామకపు తేదీ నుంచి కమిటీలో ఆయన సభ్యత్వాన్ని కోల్పోతారు.

**పదవీ కాలం :**

కమిటీ సభ్యుల పదవీకాలం ఒక సంవత్సరం. రాబోవు ఆర్థిక సంవత్సరానికి గాను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపల కమిటీ ఎన్నికలు జరపాలి. ఏ పరిస్థితులలోనైనా ఆ విధంగా ఎన్నికలు జరపనియెడల, కొత్త సభ్యులను ఎన్నుకునే వరకు ప్రస్తుత సభ్యులే పదవిలో కొనసాగుతారు.

### విధులు : (రూల్ 254)

అనుసూచికలో నిర్దిష్టపరచిన ప్రభుత్వ సంస్థలు, అంతేకాక సభాపతి ఆయా సమయాల్లో నిర్దిష్టపరచే యితర ప్రభుత్వ సంస్థలు పనిచేస్తున్న తీరును పరీక్షించటం ప్రభుత్వ సంస్థల కమిటీ విధి. కమిటీ ప్రభుత్వ సంస్థల నివేదికలను, లెక్కలను పరిశీలిస్తుంది. ప్రభుత్వ సంస్థల కమిటీ, ప్రభుత్వ సంస్థల స్వయం పాలనాధికారం, సామర్థ్యం విషయాలలో ప్రభుత్వ సంస్థల వ్యవహారాలను సక్రమ వ్యాపార సూత్రాల, వివేకవంతమైన వాణిజ్య సాంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నది లేనిది కమిటీ పరిశీలిస్తుంది.

### కమిటీలలోని సభ్యులు ప్రయోజనాన్ని తెలుపుట :

కమిటీ పరిశీలించనున్న విషయంలో సభ్యునికి వ్యక్తిగతమైన, ఆర్థిక పరమైన, లేదా ప్రత్యక్షమైన ప్రయోజనమున్నపుడు సభ్యుడు/సభ్యురాలు ఆఫిడవిట్ రూపంలో ఆ ప్రయోజనాన్ని కమిటీ చైర్మన్ ద్వారా సభాపతికి తెలపాలి.



# 16

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## ప్రభుత్వ సంస్థల కమిటీ




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి

సచివాలయం, వెలగపూడి, అమరావతి.